# బురదలో బంతిపూలు

నేనీ మధ్య టీవీలో ఒక డాక్యుమెంటరీ చూశాను. అంత మంచి సినిమా గురించి మీకు చెప్పటం నా బాధ్యత అని కూడా అనిపించి ఈ వ్యాసం వ్రాస్తు న్నాను. క్లుప్తంగా చెప్పేసి కథాంశాన్ని పలుచన చేయటం ఇష్టంలేదు. అందుకే దీన్ని రెండు దఫాలుగా, అంటే ఈవారం, వచ్చే వారం వేరువేరు మకుటాలతో వ్రాస్తున్నాను.

ఇంతకీ ఆ డాక్యుమెంటరీ పేరు 'బోర్న్ ఇన్‌టు బ్రోతల్స్'. కలకత్తాలోని పడుపు వీధుల్లో పిల్లల గురించి తీసిన సినిమా. ఎంతో భవిష్యత్తున్న పిల్లలు ఆ బురదలో ఎలా పెరుగుతున్నారు? వాళ్ళని బయటకు తీసుకువచ్చే ప్రయత్నం జరగు తున్నదా? ఆ పడుపు సందుల్లో పారిజాతాలు, వేశ్యా వీధుల్లో విరజాజులు, కామాం ధుల మధ్య కనకాంబరాలు అలా వాడిపోవలసిందేనా? ఇవన్నీ ప్రశ్నలు. జవాబులు ఇచ్చే ఉద్దేశ్యం మనసు ఇటు ప్రభుత్వానికి కానీ, అవన్నీ పాపకూపాలని నమ్మి వాటిని పట్టించుకోని ప్రజలకి కానీ లేనేలేవు. అయినా మనసుంటే మార్గం వుండక పోదు. జరిగింది జరిగినట్టుగా అదే చూపిస్తుంది ఈ సినిమా. దీనికి నా తెలుగు పేరు 'బురదలో బంతిపూలు'. జానా బ్రిస్కీ, రాస్ కాఫ్‌మన్ తీసిన సినిమా. నిజంగా జరిగిన కథ.

న్యూయార్క్‌లో జానా బ్రిస్కీ ఒక చక్కటి ఫొటోగ్రాఫర్. ప్రపంచమంతా తిరిగి మంచి ఫొటోలు తీసి ప్రదర్శిస్తూ వుంటుంది. ఆవిడ భారత దేశం వచ్చింది. ఒకసారి కాదు రెండు మూడేళ్ళ వ్యవధిలోనే ఎన్నోసార్లు. మొదటిసారి వచ్చినప్పుడే కలకత్తాలో రెడ్‌లైట్ డిస్ట్రిక్ట్‌లో, అంటే పైన చెప్పిన పడుపు సందులూ గొందుల్లో, అమాయకులైన పిల్లల్ని చూసింది. కొంతమందితో స్నేహం కలిపింది. వాళ్ళ జీవితా ల్లో ఎలా వెలుగు చూపాలా అని తహతహలాడింది. మనసుంటే మార్గం వుండక పోదు అని మనకేకాదు ఆవిడకీ తెలుసు. కాకపోతే ఆవిడ మనసు పెద్ద మనసు. ఎంతో ఓపికా, పట్టుదలా, కార్యదీక్షా, అన్నిటికీ మించి ఏదైనా సరే త్యాగంచేసే మనసది. ఆ కథే ఈ కథ.

ఆ వేశ్యా వీధుల్లో జానా ఫొటోలు తీస్తుంటే ఎంతోమంది ఆవిడని తిరస్క రించారు. శత్రువులా చూశారు. కానీ కొందరు పిల్లలు, మన బంతి పూలు, ఆవిడ చుట్టూ చేరి మొదటిసారిగా కెమేరాని వింతగా చూశారు. వాళ్ళ సరదా చూసి ఆవిడ వాళ్ళ చేత కొన్ని ఫొటోలు తీయించింది. మరి జానాకి ఏ కళాత్మక ధోరణి కనప డిందో కానీ వాళ్ళని ఆ చీకటి కూపంలోనించీ బయట పడవేయటానికి ఒక మార్గం ఊహాపరంగా కదలాడింది. వెంటనే ఆచరణలో పెట్టింది కూడాను.

కొచ్చి, శాంతి, సుచిత్ర, పూజ తపసి అనే ఐదుగురు ఆడపిల్లలు, అవిజిత్ మానిక్, గౌర్, మముని అనే నలుగురు మగపిల్లలూ ఆవిడ దృష్టిలో పడ్డారు. అందరూ ఏడెనిమిదేళ్ళ వయసు నించీ పది పన్నెండేళ్ళలోపు వాళ్ళే. ఒక్కొక్కళ్ళదీ ఒక్కొక్క కథ. అన్ని కథలలోనూ కథనం వేరైనా కథా వస్తువు ఒకటే. చదువు

కోవాలనివున్నా ఎవరూ స్కూలుకి వెళ్ళి చదువుకోవటం లేదు. స్కూలుకి వెడితే మరి ప్రొద్దున్న ఐదు గంటలనించీ, రాత్రి పదకొండు గంటలదాకా పనులు ఎవరు చేస్తారు. ఇల్లూడవటం, అంట్లు తోమటం, నీళ్ళు పట్టటం, వంటలు వండటం, రాత్రి పూట డ్రింకులూ తిండీ పాసెంజర్లకి అందివ్వటంతో రోజు పూర్తవుతుంది. అదీకాక ఆడ పిల్లలు చదువుకుంటే, వాళ్ళు పెరిగాక వ్యాపారానికి పనికివస్తారని ఆశలు పెట్టుకున్న వారేమయిపోతారు?

సుచిత్రకి అమ్మ చచ్చిపోతే అత్త వ్యాపారంలో దించటానికి తనే పెంచుతు న్నది. అంటే రేపటి వ్యాపారానికి ఇవాళ పెడుతున్న పెట్టుబడి అన్నమాట ఆ తిండీ గూడూ గుడ్డా. 14 ఏళ్ళ పిల్లనీ, 11 ఏళ్ళ పిల్లనీ అప్పుడే వ్యాపారంలోకి దించేశారు. ఇక నీదే ఆలస్యం సుచిత్రా అంటున్నారు. అవిజిత్ చక్కటి పెయింటర్. అతని బొమ్మలు ఎంతో లోతుగా ఆలోచనలు రేకెత్తించేవిగా వుంటాయి. 'నా ఆలోచనలనే రంగుల్లో కాగితం మీద పెడతాను, దాన్నే మీరు పెయింటింగ్ అంటున్నారు' అన్నాడు అవిజిత్ జానాతో. చిన్నవాడైనా అతనెంత తెలివిగలవాడో ఆ బొమ్మలు చూస్తేనే తెలుస్తుంది. అతనికి బాగా చదువుకుని డాక్టర్ అవాలని వుంది. కానీ చదువెవరు చెప్పిస్తారు? అలాగే మిగతా వాళ్ళూనూ. తల్లీ, చుట్టుపక్కల అమ్మలక్కలూ మాట్లాడే బూతు మాటల ఛండాలం వినలేక చెవులు మూసుకుంటుంది శాంతి ఎప్పుడూ. అక్కడ్నించీ ఎప్పుడు పారిపోదామా అనిపిస్తుంటుంది కూడాను. కానీ ఎలా బ్రతకటం? కొచ్చి వాళ్ళమ్మ పల్లెటూరికి పారిపోయింది. హౌరా బ్రిడ్జ్ మీద నించీ దూకి చచ్చిపోవాలను కున్నాను. కానీ ధైర్యం చాల్లేదంది. వాళ్ళ నాన్నకి ఎప్పుడూ పొగాకు నమలటం, చుట్టలు తాగటం. వేరే పనిలేదు. పనంతా కొచ్చి చేయాల్సిందే కొచ్చిని లండన్ పంపించి చదివిస్తానని చెబుతాడు అందరితో.

ఇంకో కథ - 'అమ్మని పోలీసులు పట్టుకెళ్ళారు వ్యభిచారం చేస్తున్నదని. నాన్న పోలీసులకి లంచం పెట్టి వెనక్కి తీసుకొచ్చి మళ్ళీ వ్యాపారం సాగిస్తూనే వున్నాడు. నన్ను ఒక వ్యభిచార గృహానికి అమ్మటానికి మా నాన్న ఎంతో ప్రయత్నించాడు. మా అక్క అడ్డుకుంది' అంటుందా పన్నెండేళ్ళ పిల్ల. 'మా అమ్మ పాసెంజర్ల దగ్గర డబ్బులు సంపాదించి నాన్నకి ఇవ్వాలి. నాన్నేమో ఇంకా అమ్మనే చావబాదుతుంటాడు' ఇంట్లో అన్ని పనులూ పిల్లలే చేయాలి కానీ, కస్టమర్లు వున్నప్పుడు ఇంట్లోనించీ పిల్లలు బయటికి పోవాలి.

వాళ్ళు బ్రతుకున్నది మామూలు బురదలో కాదు. తాగుబోతులూ, మత్తు పదార్థాలకి అలవాటు పడ్డవాళ్ళూ, నేరస్థులూ, వ్యభిచారం సంగతి సరేసరి... ఇవన్నీ వున్నాయి ఆ బురదలో. 'వీళ్ళంటే నా కెందుకూ ఇంత ప్రేమా, సహాయం చేయాలనే తపనా అని అనుమానంగా వుంది కొందరికి. దానికి ఒకటే సమాధానం. వాళ్ళని మొదటిసారిగా కలిసి ఆ కథలు విన్నాక, నాకు వాళ్ళతో ఒక విధమైన అనుబంధం ఏర్పడింది. ఎందుకో నాకూ తెలీదు' ఎదుటి మనిషి మనిషిలా బ్రతకలేక పోతున్నప్పుడు జానాలాటి మానవత్వం వున్న మనిషిలోని ఆవేదనా, తపనా స్పందన నిచ్చి ముందుకి నడిపించదూ మరి!.

జానా, వాళ్ళు తీసిన ఫొటోలు చూసి ఆశ్చర్యపోతుంది. టెక్నిక్ అంత గొప్పగా లేకపోయినా, వారి కళాదృష్టి చూసి. ఫొటోలు ఎలా తీయాలో, దృశ్యాన్ని ఫ్రేములో ఎలా పెడితే అందంగా వస్తుందో సులువులన్నీ నేర్పిస్తే, ప్రపంచంలో ఎవరికీ తీసిపోని కళాత్మకమైన ఫొటోలు సులభంగా తీయగలరు. అందులోనూ నిజమైన వాతావరణంలో నివసిస్తున్న నిజమైన మనుష్యులు. మరి వాళ్ళు కొంత సాధన చేస్తే గొప్ప ఫొటోగ్రాఫర్లు కారూ! అందుకే తన సమయమూ డబ్బూ ఖర్చయినా, కష్ట నష్టాలకి ఓర్చి, తనికి తెలిసిన సులువులన్నీ నేర్పించింది.

అందర్నీ ఒకరోజు టాక్సీలో జూకి తీసుకువెళ్ళింది. మొదటిసారిగా టాక్సీలో, అందులోనూ జూకి... వారి జీవితాల్లో మొదటి వసంతం మరి... సరదాగా వుంది. ఆంటీ అంటూ జానాకి బాగా దగ్గరయారు కూడాను. జానా వాళ్ళకి కాస్తో కూస్తో ఇంగ్లీషు కూడా నేర్పింది. వాళ్ళక్కడ నెమళ్ళనీ, ఏనుగులనీ, రామచిలుకలనీ ఎంతో చక్కగా కెమేరాల్లో ఎక్కించారు. అది చూసి ఆమె మళ్ళీ ఇంకొక రోజు - తొమ్మిది మందినీ బీచ్‌కి తీసుకువెళ్ళింది. అక్కడా అంతే. సముద్రం మీద సూర్యుడి అరుణ కాంతులకి కొత్త అందాలనిచ్చారు వాళ్ళు. అలా రెండు సంవత్సరాలు జానా వాళ్ళ పక్క నిలిచి ఫొటోగ్రఫీలో మెళుకువలు నేర్పించింది. అంతేకాదు. పిల్లలందరూ ఆ కుళ్ళు కూపాలనించి బయటపడాలంటే వాళ్ళు స్కూళ్ళకి వెళ్ళి చదువుకోవటం ఎంతో అవసరమని చెప్పింది. తండ్రులు వద్దని వాదిస్తే, తల్లులు అమ్మమ్మలూ సమర్థించారు. స్కూలుకి ఎవరు తీసుకెడతారు వద్దులే అని కొందరు. అంత డబ్బు మేము కట్టలేం అని కొందరు. చదువు అనవసరం అని మరికొందరు. పిల్లల్లో దాదాపు అందరూ చదువు కోవాలనే ఉత్సాహం చూపించారు. జానా ఆ ప్రోత్సాహం తోనే తన ప్రయత్నాలూ ప్రారంభించింది.

అడ్రస్ చెప్పగానే, అక్కడా అలాటి పిల్లలని స్కూల్లో చేర్చుకోం అన్నారు. అడ్రస్ వున్న రేషన్ కార్డ్ చూపించండి మాట్లాడదాం అన్నారు కొందరు ఔదార్యులు. అవెక్కడున్నాయి. వాటికోసం ఎన్నో ఆఫీసులు తిరిగింది జానా. ఇది స్టాంప్ పేపర్ మీద అప్లై చేయాలి. రేషన్ ఆఫీసర్ సంతకంచేశాక తీసుకువస్తే ఇంకో ఫాం ఇస్తాం. అది నింపి ఇస్తే, నెల రోజుల్లో ఇస్తాం' అన్నారు. చివరికి అవీ సంపాదించింది జానా.

ఎన్నో బోర్డింగ్ స్కూళ్ళ చుట్టూ, ఉచితంగా పాఠాలు చెప్పే స్కూళ్ళ చుట్టూ తిరిగింది. ఎక్కడ చూసినా చుక్కెదురయింది. ఒక పక్క ఇదిలా వుండగా, ఇంకొక పక్క పిల్లలు చదువుకోవటం ఇష్టం లేని తల్లిదండ్రుల అభ్యంతరాలూ, నిష్ఠూరాలూ. ఎందుకు చేయాలి ఇదంతా? తన దేశమా? తన పిల్లలా? ఎవరి కోసం చేయాలిదంతా? ఎవరి కోసమా? ఎదురుగానే వున్నారు. ఆశలని అణిచిపెట్టు కుంటూ, భవిష్యత్తు భయపెడుతుంటే, దారీ తెన్నూ తెలియక కుళ్ళు సమాజంలో కుమిలిపోతున్న పసిడి సుమాలు. లేలేత కుసుమాలు.

ఈ విశాల ప్రపంచంలో జానెడు స్వర్గం చూపించటం అంత కష్టమేమీ కాదు ప్రయత్నిస్తే. అందుకే వాళ్ళ కోసం తన పట్టుదలను వదలలేదు జానా. కానీ చేయగలిగిందా? వచ్చే సంచికలో చూద్దాం దానికి జవాబు.